ప్రజాశక్తి

శనివారం 15 జూన్ 2024

5

పార్వతీపురం మన్యం

తొలి సంతకంతోనే హామీ నిలబెట్టుకున్నారు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రోజునే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఐదు ఫైళ్లపై తొలి సంతకం చేసి మాట నిలబెట్టుకున్నారని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. 16,347 పోస్టులతో మెగా డిఎస్‌సి, పెన్షన్ల పెంపు, అన్నా క్యాంటీన్లు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, స్కిల్ డెవలప్మెంట్ ఉపాధిపై తొలి సంతకం చేశారని అన్నారు. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా చంద్రబాబు పాలన ఉంటుందన్నారు. గిరిజన యువతకు ఉపాధి కల్పన, పంట పొలాలకు సాగునీరు, మెరుగైన విద్య, వైద్యం, తాగునీరందించే దిశగా కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు.

సంధ్యారాణికి స్త్రీ, శిశు , గిరిజన సంక్షేమం

శ్రీనివాస్‌కు చిన్న, మధ్యతరహా పరిశ్రమలు

- సంధ్యారాణి సామర్థ్యానికి గీటురాయి
- కీలకమైన రెండు మంత్రిత్వ శాఖలు కేటాయింపు
- స్వయం ఉపాధి, గిరిజన సంక్షేమంపై జిల్లా వాసుల్లో చిగురిస్తున్న ఆశలు

సాలూరు ఎమ్మెల్యే గుమ్మడి సంధ్యారాణికి స్త్రీ,శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు అప్పగించారు. గజపతినగరం ఎమ్మెల్యే కొండపల్లి శ్రీనివాస్‌కు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్‌ఎంఇ), పేదరిక నిర్మూలన సెర్ప్, ఎన్‌ఆర్‌ఐ సాధికారిత, సంబంధాల శాఖ మంత్రిగా అవకాశం లభించింది. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వీరిద్దరికీ మంత్రి పదవులు కేటాయిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. దీంతో, టిడిపి కార్యకర్తలు, నాయకుల్లో జోష్ నెలకుంది. మంత్రి శ్రీనివాస్ ఆదివారం జిల్లాకు రానున్నట్టు సమాచారం. ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు ఆయన అనుచరులు, అభిమానులు, పార్టీ నాయకులు సిద్ధమయ్యారు. సంధ్యారాణి శుక్రవారం సాయంత్రమే జిల్లాకు చేరుకున్నారు. సాలూరులో ఆమెకు ఘన స్వాగతం లభించింది.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి/సాలూరు

ఉమ్మడి జిల్లాలోని మంత్రులిద్దరికీ మంచిశాఖలే లభించాయి. గుమ్మడి సంధ్యారాణి సామర్థ్యాన్ని గుర్తించి ఆమెకు కీలకమైన రెండు మంత్రిత్వ శాఖల కేటాయించారు. గిరిజన ఎమ్మెల్యే కావడంతో ఆమెకు గిరిజన సంక్షేమ శాఖ కేటాయిస్తారని అందరూ ఊహించారు. ఎమ్మెల్యేగా మొదటిసారి ఎన్నికైనప్పటికీ గతంలో ఎమ్మెల్సీగా పని చేసిన అనుభవం, పొలిట్ బ్యూరో సభ్యురాలిగానూ, ఐసిడిఎస్ రీజనల్ ఆర్గనైజర్‌గా పనిచేసే అనుభవం ఉండడంతో ఆమెకు అదనపు మంత్రిత్వ శాఖను కేటాయించారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రిగా కూడా ఆమె అదనపు బాధ్యతలను నిర్వహించనున్నారు. ఇంతవరకు నియోజకవర్గం నుంచి ఎన్నికైన ఎమ్మెల్యేల్లో బోయిన రాజయ్య, పీడిక రాజన్నదొర గిరిజన సంక్షేమ శాఖ మంత్రులుగానే పని చేశారు. ఇప్పుడు సంధ్యారాణికి స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రిత్వ శాఖను అదనంగా కేటాయించడం ఆమె సామర్థ్యానికి గీటురాయిగా కనిపిస్తోంది. ఉమ్మడి విజయనగరం జిల్లాలో కూడా గతంలో కీలకమైన రెండు శాఖలు నిర్వహించిన మంత్రులున్న దాఖలాల్లేవు.

ఉపాధ్యాయురాలి నుంచి అమాత్యురాలిగా

పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో గిరిజన సంక్షేమ శాఖలో గుమ్మడి సంధ్యారాణి ఉపాధ్యాయురాలిగా కొంతకాలం పని చేశారు. సాలూరు, మక్కువ మండలాల్లో ఆమె పని చేశారు. వివాహమైన కొంతకాలం తర్వాత ఆమె ఉద్యోగానికి రాజీనామా చేసి 1999లో రాజకీయ అరంగేట్రం చేశారు. ఏ శాఖలో ఆమె ఉపాధ్యాయురాలిగా పని చేశారో అదే శాఖకు మంత్రిగా పని చేసే అవకాశం ఆమెకు దక్కింది.

మరో మంత్రి శ్రీనివాస్‌కు ఇదో అరుదైన అవకాశం. అనూహ్యంగా మంత్రి కావడంతోపాటు మంచి శాఖ కూడా లభించింది. గతంలో మన జిల్లా నుంచి భారీ పరిశ్రమల శాఖ మంత్రిగా బొత్స సత్యనారాయణ పనిచేశారు. భూమి, నీరు, రోడ్డు, రవాణా సదుపాయాలు పుష్కలంగా ఉన్నప్పటికీ జిల్లాకు ఒక్కటంటే ఒక్క భారీ పరిశ్రమ కూడా రాకపోగా, ఉన్న పరిశ్రమలు మూతపడ్డాయి. దీంతో, జిల్లా వాసులు కొంత నిరాశ చెందారు. తాజాగా శ్రీనివాస్‌కు అతి చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిగా అవకాశం వచ్చింది. తద్వారా జిల్లాలో ఉపాధి అవకాశాల కోసం ఎదురు చూస్తున్నవారికి ఊరట కల్పించవచ్చు. ఇందుకు తగ్గ పరిశ్రమల ఏర్పాటుకు కూడా జిల్లా ఎంతో అనువుగా ఉంది. ముఖ్యంగా విజయనగరం పూర్తిగా వ్యవసాయ ఆధారిత జిల్లా. వరి విస్తారంగా సాగవుతున్నప్పటికీ మిల్లులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఈ పేరుతో ఏటా ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న ధాన్యాన్ని గోదావరి జిల్లాలకు పంపుతున్నారు. పత్తి, మొక్కజొన్న, చెరకు, మామిడి తదితర పంటలు కూడా ఎక్కువగానే సాగవుతున్నాయి. అటు ఏజెన్సీలో చింతపండు, జీడి సాగవుతుంది. వీటి ఆధారంగా మామిడి తాండ్ర, జీడి, మొక్కజొన్న ప్రాసెసింగ్ పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు మంచి అవకాశాలు ఉన్నాయి. ఇవి మచ్చుకు మాత్రమే. ఈ అన్ని రంగాల్లోనూ అనుబంధ పరిశ్రమలు ఏర్పాటుకు ప్రోత్సహించే అవకాశం మంత్రిగా శ్రీనివాస్‌కు దక్కింది. ఇప్పటికే జిల్లాలో జూట్, ఫెర్రో ఎల్లాయిస్ మూతపడిన నేపథ్యంలో శ్రీనివాస్‌కు దక్కిన శాఖకు ముఖ్యంగా మన జిల్లాలో ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. దీంతోపాటు సెర్ప్ (పేదరిక నిర్మూలన) విభాగం కూడా ఈయన పరిధిలోనే ఉంది. తద్వారా మహిళల్లో స్వయం ఉపాధి, సాధికారత సాధించే దిశగా ప్రోత్సహించేందుకు అవకాశం ఉంటుంది. ఇక ఎన్‌ఆర్‌ఐలతో మెరుగైన సంబంధాలు ఏర్పాటు చేయగలిగితే సోషల్ రెస్పాన్సబిలిటీలో భాగంగా రాష్ట్ర సంక్షేమం, ఉపాధి, స్కిల్ డెవలప్‌మెంట్, అభివృద్ధికి నిధులు తెచ్చుకునే అవకాశం కలుగుతుంది. తద్వారా సొంత జిల్లాకు ఎంతో కొంత ఎక్కువగానే మేలు చేసుకునేందుకు అవకాశం ఉంటుందనడంలో సందేహం లేదు. యువకుడైన శ్రీనివాస్ సమర్థవంతగానే శాఖలు నిర్వహిస్తారని జిల్లా వాసులు ఆభాశావం వ్యక్తం చేస్తున్నారు.

సంధ్యారాణికి ఘనస్వాగతం

సాలూరు : రాష్ట్ర గిరిజన సంక్షేమ, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి శుక్రవారం సాయంత్రం పట్టణానికి వచ్చారు. నియోజకవరం లోని నాయకులు, కార్యకర్తలు ఆమెకు పట్టణంలోని వేగావతి నది వంతెన నుంచి స్వాగతం పలికారు. భారీ ఊరేగింపుతో బాణసంచా, మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో ఆమెకు స్వాగతం పలకాలని నాయకులు ఏర్పాట్లు చేసినప్పటికీ శుక్రవారం మధ్యాహ్నం భారీ వర్షం పడడం, పెనుగాలులకు చెట్లు పడిపోవడంతో సంబరాలకు కొంత అంతరాయం ఏర్పడింది. చిరుజల్లులు పడుతున్నా సంధ్యారాణి టాప్ లేని కారులో ర్యాలీ సాగించారు. పట్టణ పార్టీ అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, సీనియర్ నాయకులు పప్పల మోహన్, కూనిశెట్టి భీమా రావు, అక్కేన అప్పారావు, రాయుడు, పాచి పెంట మండల అధ్యక్షులు పిన్నింటి ప్రసాద్ బాబు, సాలూరు మండల అధ్యక్షులు ఆముదాల పరమేష్, మక్కువ మండల అధ్యక్షులు జి.వేణుగోపాల్ ఆధ్వర్యాన నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీతో స్వాగతం పలికారు.

ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి సంధ్యారాణి

గాలివాన బీభత్సం

- పెనుగాలులతో కూడిన జడివాన
- నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- వర్షంతో రైతులకు ఊరట

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలో శుక్రవారం కురిసిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. పెనుగాలులతో కూడిన జడివాన గంటపాటు పడడంతో జనజీవనం స్తంభించిపోయింది. అత్యంత వేగంగా వీచిన గాలులకు దండిగాం రోడ్డులో రెండు చెట్లు పూరిళ్లపై పడ్డాయి. దీంతో ఆ రెండు ఇళ్లు ధ్వంసమయ్యాయి. ప్రధాన రహదారిలో యూనియన్ బ్యాంక్ ఎదురుగా వున్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ నేలకొరిగింది. దీంతో వందలాది గృహ విద్యుత్ కనెక్షన్లు వున్న ట్రాన్స్ ఫార్మర్ పడిపోయిన సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. టౌన్ సిఐ వాసునాయుడు ఆధ్వర్యాన పట్టణ ఎస్ఐలు, పోలీసులు రంగంలోకి దిగి ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌ను లేపారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఉన్న చెట్లు పడిపోవడంతో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ఫకీర్ రాజు ఆధ్వర్యాన పారిశుద్ధ్య సిబ్బంది వాటిని తొలగించారు. శుక్రవారం సాయంత్రం మంత్రి గుమ్మడి సంధ్యారాణి రాక సందర్భంగా పట్టణంలో అనేకచోట్ల ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, కటౌట్లు నేలకొరిగాయి. గిరిజన సంక్షేమ శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రిగా సంధ్యారాణి రాక సందర్భంగా పట్టణంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించనున్న నేపథ్యంలో ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు.

సీతంపేట : మండల కేంద్రంలో సాయంత్రం కొద్దిపాటి వర్షం కురిసింది. గత ఐదు రోజులుగా ఎండలో భగభగ మండినప్పటికీ ఉష్ణోగ్రతలు ఏ మాత్రం తగ్గకపోవడంతో ప్రజలు ఎండలు వేడిమితో ఒక్క పోతతో అల్లాడిపోతున్నారు. ఈ వర్షంతో వాతావరణం ఒకసారిగా చల్లబడడంతో ప్రజలకు కొంత ఉపశమనం మిగిలింది.

సాలూరులో ఈదురుగాలులకు నేలకొరిగిన చెట్లు

మక్కువలో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

సీతానగరం : మండలంలోని శుక్రవారం కురిసిన వర్షంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. సుమారు రెండు గంటలు వర్షం పడ్డంతో ఆకులు వేసేందుకు రైతులు సిద్ధపడుతున్నారు. అలాగే దుక్కులు దున్ని పూర్తిస్థాయిలో ఆకలేసేందుకు రైతులు వర్షం ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

వీరఘట్టం : మండలంలో శుక్రవారం ఉరుములు, మెరుపులతో పాటు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో రహదారులు బురదమయంతో పాటు వీరఘట్టంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో వర్షం నీరు చేరింది.

మక్కువ : మండలంలో గాలివానా బీభత్సం సృష్టించింది. పలుచోట్ల చెట్లు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. వెంకట బైరపురం కాశీపట్నం పంచాయతీ కొండరేజారు చీముడు తదితర పంచాయతీల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరగ్గా, మక్కువ -చినబోగిలి బొబ్బిలి రహదారుల్లో చెట్లు కూడా విరిగిపడ్డాయి. దీంతో మండలమంతా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

పిడుగు పాటుకు కొబ్బరి చెట్టుపై మంటలు

పార్వతీపురంరూరల్ : మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం భారీగా కురిసింది. అక్కడక్కడ పెద్ద శబ్దంతో ఉరుములు, పిడుగులు పడ్డాయి. పార్వతీపురం మండలం సూడిగాంలో ఓ కొబ్బరి చెట్టుపై పిడుగు పడడంతో మంటలు చెలరేగాయి. స్థానికంగా ప్రజలు సమీపంలో పిడుగు పడటంతో భయాందోళన చెందారు. ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు.

గిరిజనులకు ప్రత్యేక డిఎస్‌సి ఇవ్వాలి

పార్వతీపురంరూరల్ : గిరిజన ప్రత్యేక డిఎస్‌పి ప్రకటించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.రామస్వామి, సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో ఆయన మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతంలో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను గిరిజన నిరుద్యోగ యువతీ యువకులతో ప్రత్యేక డిఎస్‌సి ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం జీవో 3ను పునరుద్ధరించకుండా ఆదివాసీ నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేసింద న్నారు. చంద్రబాబు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జిఒ 3ను అమలు చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చా లని కోరారు. 16,350 పోస్టుల్లో మెగా డీఎస్సీ ప్రకటించడాన్ని వారు స్వాగతించారు. గిరిజన ప్రత్యేక డిఎస్‌సికి కూడా నోటిఫికేషన్ జారీ చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 39వేల పోస్టులు ఖాళీగా ఉన్నా కేవలం 16350 పోస్టులకు మాత్రమే తీస్తున్నా రని విమర్శించారు. అలాగే ఐదేళ్లతో పాటు ఐటిడిఎ పరిధిలో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలేదని, ఈ ప్రభుత్వమైనా తర్వాతైనా ఐటిడిఎ పరిధిలో ఉన్న బ్యాక్లాగ్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

పెదకుదమలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రజాసేవకు అంకితమవుతా : జగదీశ్వరి

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

అఖండ విజయాన్ని అందించి, నిండు మనసుతో ఆశీర్వదించిన నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని, ఇకపై తన ప్రయాణాన్ని ప్రజాసేవలో గడిపి ప్రజా ప్రయోజనాలకే అంకితమౌతానని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. తనకు పార్టీ టికెట్ ఇచ్చి అంతటి ఘన విజయానికి కారకులైన శత్రుచర్ల విజయరామరాజు, వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్‌కు, నియోజకవర్గంలోని ప్రతి మూడు పార్టీలకు చెందిన నాయకులకు, కార్యకర్తలకు రుణపడి ఉంటానని ఆమె తెలిపారు. ప్రమాణ స్వీకారం అనంతరం శుక్రవారం టిడిపి నాయకలు డొంకాడ రామకృష్ణ, పల్ల రాంబాబుల ఆధ్వర్యంలో కుదమ పంచాయతీలో ఊరేగింపు చేపట్టారు. పంచాతీలో గల చినకుదమ, గౌరీపురం, పెదకుదమ గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పూల వర్షం కురిపించి అడుగడుగునా నీరాజనాలు పలికారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రైన్లు, సాగునీరు, ఇంటింటి కుళాయి, పెదకుదమలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇలా అనేక సమస్యలున్నాయని, వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని ప్రజాసంక్షేమానికి రేపు జరగబోవు అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఇందుకు ఎంఎల్ఎ సానుకూలంగా స్పందించి తనపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయనని హామీ ఇచ్చి నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఆమె అన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం, బిజెపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు ఉద్యానవనాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రైతులకు ఉద్యాన వన వ్యవసాయాలపై అవగాహన ఉంటే ఆర్థికంగా బలోపేతం పొందేందుకు అవకాశం ఉంటుందని రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని కొత్తగూడ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ఆవరణలో ఉపాధి చట్టం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. 2024-25 హార్టికల్చర్ లబ్ధిదారులకు కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా ఉద్యానశాఖపై అవగాహన నిర్వహిస్తున్నామని, ఈ మేరకు రైతులు వీటిని సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రైతులు ఆర్థికంగా నిలదొక్కుకునే పంటలపై దృష్టి పెడితే బాగుంటుందన్నారు. సదస్సుకు వంగర, కేదారిపురం, నాంద్రుకోన, రెల్ల, దుమ్మంగి, కుక్కిడి పెదఖర్జా, తాడికొండ, ఇరిడి, లుంబేసు గ్రామపంచాయతీలకు సంబంధించిన లబ్ధిదారులు పాల్గొన్నారు. ఉపాధి హామీ ద్వారా కూడా పలు రకాల లాభదాయక పనులు చేపడుతున్నామని, ఈ మేరకు రైతులు కూడా లాభదాయకమైన మొక్కలను పెంచుకుంటే ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చని అన్నారు.

సంక్షేమ హాస్టళ్లపై నిర్లక్ష్యం

ప్రాణ నష్టం జరిగితేనే స్పందిస్తారా?

శిథిలావస్థకు చేరిన ఎస్‌సి, బిసి వసతి గృహాలు

బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - కురుపాం

సంక్షేమ హాస్టళ్ల నిర్వహణపై ప్రభుత్వాధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటికీ ఇంతవరకు ఉన్నతాధికారులు హాస్టళ్ల వైపు కన్నెత్తి చూసే దాఖాలాల్లేవని, సమస్యల వలయంలో చిక్కి కొట్టుమిట్టాడుతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. నియోజకవర్గ కేంద్రమైన కురుపాంలో గల మంతినివలసకు ఎదురుగా ఉన్న ఎస్‌సి, బిసి వసతి గృహ భవనాలు ఉన్నాయి. ఈ హాస్టళ్లలో 6 నుంచి 10వ తరగతి వరకు సుమారు వంద మంది వరకూ విద్యార్థులు వసతి పొందుతున్నారు. హాస్టల్ భవనం గది పైకప్పు పెచ్చులూడి పడడంతో వర్షం వచ్చిన ప్రతిసారి కూలుపోతుందేమోనని విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. రెండు నెలల సెలవుల్లో ఈ సంక్షేమ హాస్టళ్లకు కనీసం పై కప్పే మరమ్మతు చేసుంటే కొంతవరకు విద్యార్థులకు భయాందోళన పోయేది. హాస్టల్ భవనాలకు సున్నం, రంగులు వేయకపోవడం, మరమ్మతులు చేపట్టకపోవడంతో భవనం శిథిలావస్థకు చేరుకుంది. రాత్రి వేళల్లో విద్యార్థులు నిద్రించినప్పుడు భవనం కూలినా, పైకప్పు పెచ్చులూడి పడినా విద్యార్థులు గాయాలపాలు కాకతప్పదు. నాడు నేడులో నిధులు మంజూరై ఐదేళ్లు కావస్తున్నా కనీసం టెంకాయ కొట్టే పరిస్థితి ఈ సంక్షేమ హాస్టళ్లకు లేదు. దీంతో ఎక్కడ వేసిన గొంగలు అక్కడేలా ఉంది. వేసవి సెలవులు అనంతరం కూడా అలాగే దర్శనమిస్తున్నాయి.

కన్నెత్తి చూడని అధికారులు

నియోజవర్గ కేంద్రానికి అధికార కార్యక్రమాల్లో పాల్గొనేందుకు జిల్లా అధికారులు కురుపాం తరచూ వస్తూ పోతున్నారు. ఇంతవరకు ఆ హాస్టళ్లపై కన్నెత్తి చూసే పాపాన లేదు. వేసవి సెలవులు ఇచ్చి రెండు నెలలు గడుస్తున్నా విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే సరికి హాస్టళ్లకు అధికారుల పర్యవేక్షణ కరువై విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేని హీన స్థితిలో ఉన్నారు.

విరిగిన ఫిల్లర్లతో ఉన్న బిసి హాస్టల్ వసతి గృహం

పారిశుధ్య పనులు చేసే వారు కూడా లేరు

హాస్టళ్లలో మరుగుదొడ్ల సమస్య వేధిస్తోంది. దీంతో బిసి హాస్టల్ విద్యార్థులు కూడా ఎస్సీ హాస్టల్ విద్యార్థుల మరుగుదొడ్లను ఉపయోగిస్తున్నారు. తాగునీటి ఎద్దడి ఉన్నా సమస్యను పరిష్కరించే వారే కరవయ్యారు. పరిసరాలను శుభ్రం చేయడం, గదులను పరిశుభ్రంగా ఉంచడం వంటి పనులు విద్యార్థులే చేసుకుంటున్నారు. కనీసం పారిశుధ్య పనులు చేసే వారిని కేటాయించకపోవడమేమిటని విద్యార్థి సంఘాల నాయకులు నిలదీస్తున్నారు. ఇదేమని అడిగితే నిధుల్లేవని, బిల్లులు రావడం లేదని అధికారులు తప్పించుకుంటున్నారని విద్యార్థులు తెలిపారు. ఎస్సీ, బీసీ విద్యార్థుల సంక్షేమానికి గతంలో కోట్లాది రూపాయలు అందుబాటులో ఉండేవని, ప్రస్తుతం లోటు ఎలా ఏర్పడిందని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం ఎస్సీ, బీసీ హాస్టళ్లపై నిర్లక్ష్యం వీడి మెరుగైన సదుపాయాలు కల్పించాలని విద్యార్థుల తల్లితండ్రులు కోరుతున్నారు.

పై కప్పు పెచ్చులు ఊడుతున్న ఎస్‌సి హాస్టల్ వసతి గృహం

వసతి గృహ భవనం మరమ్మతులు చేపట్టాలి

ఎస్‌సి, బిసి వసతి గృహ భవనాలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి. విద్యార్థుల స్నానాలకు, తాగడానికి నీటి సౌకర్యం కల్పించి పరిసరాలను పరిశుభ్ర చేసేందుకు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేయాలి. రెగ్యులర్ వార్డును నియమించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి హాస్టళ్ల బలోపేతానికి చర్యలు చేపట్టాలి. త్వరలోనే హాస్టల్ విద్యార్థులతో ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతాం.

కె.రాజు,
ఎస్ ఎఫ్ ఐ జిల్లా అధ్యక్షులు.

సీతానగరంలో ఎమ్మెల్యే విజయచంద్రకు స్వాగతం పలుకుతున్న నాయకులు

ఎమ్మెల్యే బోనెలకు ఘన స్వాగతం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పార్వతీపురం ఎమ్మెల్యేగా విజయం సాధించిన బోనెల విజయ్ చంద్రకు శుక్రవారం తన స్వగ్రామం నర్సిపురంలో ఘన స్వాగతం లభించింది. మాజీ వైస్ ఎంపిపి గొట్టాపు గౌరీ వెంకటరమణ దంపతుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున గ్రామస్తులు ఆయనకు స్వాగతం పలికారు. స్వాగత ఫ్లెక్సీలతో యువత గ్రామమంతా నింపేశారు. గ్రామంలోని శివాలయంలో హనుమాన్ మందిరంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు.

సీతానగరం: పార్వతీపురం ఎమ్మెల్యేగా బోనెల విజయచంద్రకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. హనుమాన్ జంక్షన్‌లో ఆంజనేయ కోవెలలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం పార్వతీపురం బయల్దేరి వెళ్లిన ఎమ్మెల్యేకు అప్పయ్యపేట, మరిపువలసలో స్వాగతం పలికారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్ష కార్యదర్శులు పెంట సత్యంనాయుడు, వేణుగోపాలనాయుడు, టి.వెంకటఅప్పలనాయుడు, సాలహరి గోపాలరావు, కె.అరవింద్‌కుమార్, కొట్నాల రామకృష్ణ, గుంపు స్వామితో పాటు జనసేన, బిజెపి నాయకులు స్వాగతం పలికారు.

గుట్టుగా దోమతెరల తరలింపు

హాస్టల్ విద్యార్థులకు పంపిణీ చేయాల్సినవట!

ప్రజాశక్తి కథనంతో వెలుగులోకి

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని శంబర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఓ గదిలో దాచి ఉంచిన దోమతెరలు గురువారం గుట్టు చప్పుడు కాకుండా బయటకు తరలించినట్లు తెలిసింది. అయితే అవి ఎక్కడికి తరలించారు అన్నది అంత చక్కని రహస్యంగా దాగి ఉంది. సరైన తాళాలు లేని రూమ్‌లో దాచిపెట్టి ఉన్న వందలాది దోమతెరలు వెలుగులోకి తెస్తూ 'ఇలాగైతే దోమలు కొట్టవా..'? అన్న శీర్షికన 'ప్రజాశక్తి' వార్త వెలువడిన విషయం విధితమే. ఈమేరకు శుక్రవారం ఎక్కడైతే దాచి ఉంచారో ఆ విషయం కూడా బయటకు చెప్పడం లేదు. దీనిపై స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి ఎన్‌వి కిరణ్ కుమార్‌ను 'ప్రజాశక్తి' వివరణ కోరగా తాను ఉద్యోగంలో చేరకముందే అక్కడ ఉండేవన్న సంగతి మీ పత్రికలో వార్త వచ్చేవరకు తనకు తెలియదని ఆయన అన్నారు. ఉన్నతాధికారులకు ఈ విషయంపై సమాచారం ఇవ్వడం జరిగిందని, ఆ దోమతెరలు ఎర్రసామంతవలస ఆశ్రమ పాఠశాల, అనసభద్ర ఆశ్రమ పాఠశాల హాస్టల్ విద్యార్థులకు పంపిణీ చేయాల్సినవని ఆయన తెలిపారు. హాస్టల్‌కు విద్యార్థులు వచ్చిన వెంటనే వాటిని పంపిణీ చేస్తామన్నారు. అయితే గదిలో నుంచి గుట్టు చప్పుడు కాకుండా తరలించిన దోమతెరులన్నీ ఎక్కడ ఉన్నాయన్నది మాత్రం తెలపకపోవడం కోసమెరుపు.

తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న గిరిజన రైతులు

గిరిజనులకు నష్టపరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి - పాచిపెంట

గ్రీన్ ఫీల్డ్ హైవే రహదారి వల్ల భూములు కోల్పోయిన గిరిజనులకు నష్టపరిహారం చెల్లించాలని శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. భూములు కోల్పోయిన రైతులకు, గిరిజన రైతులకు పరిహారం అందించలేదని మండలంలోని పాంచాలి పంచాయితీ సీతంపేట, జీలిగివలస గ్రామాలకు చెందిన గిరిజనులు 25 ఎకరాల వరకు తీవ్రంగా నష్టపోయారని, వీరిని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. ఒకసారి సీతంపేట గ్రామం పరిశీలన చేయాలని డుంబురు లచ్చయ్య, సింగారపు చిన్నయ్య, కొర్ర సోమయ్య, రోడ్ జర్నీ లచ్చయ్య ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు వినతిని అందజేశారు. కార్యక్రమంలో గిరిజనులతో పాటు వారికి మద్దతుగా సిఐటియు సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు, గిరిజనులు పాల్గొన్నారు



రక్తదానం చేస్తున్న దాతలు

రక్తదానంతో ప్రాణదానం

ప్రజాశక్తి - పాలకొండ

మనం బతుకుతూ వేరే వారిని బతికించడం ఒక్క రక్త దానం వల్లే అవుతుందని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ చిరంజీవి అన్నారు. ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చైల్డ్ ఫండ్ ఇండియా - లింక్వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.నాగభూషణంరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాలు కన్నా రక్త దానం ఉత్తమ దానమన్నారు. ఈ రక్తదాన శిబిరంలో సుమారు 50 మంది పాల్గొన్నారని తెలిపారు. బ్లడ్ బ్యాంక్ వైద్యులు డాక్టర్ శివప్రసాద్ ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రవీంద్ర కుమార్, సిబ్బంది, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్యసేవలు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ప్రజలు ప్రభుత్వ వైద్యసేవలను వినియోగించుకోవాలని స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సంతోష్ కుమార్ తెలిపారు. మండలంలోని శివ్వాంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. తొలుత ఇటీవల మెదడు కణిత ఆపరేషన్ చేసిన నాలుగేళ్ల పాపనికి తనిఖీలు చేశారు. క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ చేయాలని తల్లిదండ్రులకు సూచించారు. వైద్య శిబిరానికి గర్భిణీలు, దీర్ఘకాలిక వ్యాధులు, బాలింతలు అవసరమైన వారికి రక్త పరీక్షలు చేసి వారికి కావాల్సిన మందులు ఇస్తూ ఆరోగ్య సూచనలు చేశారు. కార్యక్రమంలో రవణమ్మ, స్వాతి, పకీర్ నాయుడు, దుర్గాప్రసాద్, శంకరావు, ఆశా కార్యకర్త పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జగదీశ్వరికి పూలబొకేను అందజేస్తున్న సిఐ సత్యనారాయణ

ఎమ్మెల్యే జగదీశ్వరికి అభినందనల వెల్లువ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కొత్తగా ఎన్నికైన కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి అభినందనలు వెల్లువ కొనసాగుతుంది. శుక్రవారం పెద్ద సంఖ్యలో వచ్చి అభినందనలు తెలిపారు. ఎల్విన్‌పేట సిఐ సత్యనారాయణ, ఎల్విన్ పేట, కురుపాం ఎస్ఐలు బిడ్డిక శివప్రసాద్, షణ్ముఖరావు పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలిపారు. మండల విద్యాశాఖ అధికారులు, ఇంజనీరింగ్ శాఖ డిఇలు, ఎఇలు, భద్రగిరి గిరిజన గురుకుల పాఠశాల, కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, ఎఎన్ఎంలు అభినందనలు తెలిపారు.

గరుగుబిల్లి : కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి అభినందనలు వెల్లువెత్తాయి. మండలంలోని తోటపల్లి దేవస్థానం కార్యనిర్వహణ అధికారి, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఉపాధి హామీ అధికారులు, సిబ్బంది అభినందించారు. అధికారులు, అలాగే ప్రజలు కలిసి కురుపాం నియోజకవర్గంలో టిడిపి జెండా ఎగరడం ఇది రెండో సారి, అందుకు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

జిఒ 3 పునరుద్ధరణ మాటేంటి?

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబునాయుడు మొదటి సంతకం మెగా డిఎస్సీపై చేయడం పట్ల ధన్యవాదాలు తెలుపుతున్నామని గిరిజన సంక్షేమ సంఘం, గిరిజన నిరుద్యోగ సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్షులు పాలక రంజిత్ కుమార్ అన్నారు. అయితే జిఒ 3 పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. జిఒ 3 లేకుండా మెగా డిఎస్సీ జరిగితే షెడ్యూల్డ్ ఏరియా గిరిజన ప్రాంతాల్లో గిరిజన నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు. కావున గిరిజన డిఎస్‌సి ఇవ్వాలని, జిఒ 3ను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని రంజిత్ కుమార్ కోరారు.

ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం...

కురుపాం : ఎన్నికల సమయంలో గిరిజనుల కోసం టిడిపి జిఒ 3ను పునరుద్ధరిస్తామని ఇచ్చిన హామీ అమలు చేయాలని ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షులు ఆరిక చంద్రశేఖర్ కోరారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెంటనే తొలి సంతకం మెగా డీఎస్సీ దృష్టి పెట్టడం సంతోషిస్తున్నామని, అయితే ముందే జిఒ 3ను పునరుద్ధిస్తే ఆదివాసీ నిరుద్యోగ యువతకు ఉపయోగపడుతుందని తెలిపారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేసి జిఒ 3ను పునరుద్దించి ఆదివాసీ కలను నెరవేర్చాలని ఆయన కోరారు.

మూలకు చేరిన ఆడుదాం ఆంధ్ర కిట్లు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఫోటోలు ఉన్న టోపీలు, బనియన్లతో ప్రింట్ చేసిన ఆడుదాం ఆంధ్ర కిట్లు మూలన పడి మూలుగుతున్నాయి. ఇటీవల కాలంలో గ్రామంలో క్రీడా పోటీలు నిర్వహించినప్పుడు క్రీడాకారులకు వీటిని పంపిణీ చేయాల్సి ఉంది. అధికారుల నిర్లక్ష్యం వల్ల క్రీడాకారులకు కిట్లు పంపిణీ చేయకపోవడంతో లక్షలాది రూపాయలతో విలువ చేసే సామాగ్రి మూలన పడి ఉన్నాయి.

మూలకు చేరి కిట్లు

కార్యకర్తలకు అండగా ఉంటా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

రాష్ట్రంలో ఎన్‌డిఎ విజయానికి కృషి చేయడంతో పాటు, తన విజయానికి పాటుపడిన ప్రతి కార్యకర్తలకు అండగా ఉంటానని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మొట్టమొదటిసారిగా పార్వతీపురంలోని బైపాస్ రోడ్డులో ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి భారీగా తరలివచ్చిన టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ అఖండ విజయం సాధించడంలో కష్టపడిన ఎన్డీఏ కూటమికి చెందిన ప్రతి కార్యకర్తలకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వంలో పార్వతీపురంలో జరిగిన అక్రమాలను వెలికి తీసి పేదలను ఆదుకుంటానని, అలాగే అక్రమాలు, కబ్జాలపై దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కష్టంలో ఉన్న ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని, వారికి ఏ కష్టం వచ్చినా తనను డైరెక్ట్‌గా సంపాదించాలని కార్యకర్తకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, జనసేన నాయకులు చందకు అనిల్ కుమార్, రత్నమని, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జయబాబు, సీనియర్ నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, బార్నాల సీతారాం, డాక్టర్ గరిమెళ్ళ భానుప్రసాద్‌తో పాటు బలిజిపేట, సీతానగరం, పార్వతీపురం మండలాల నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలం పరిధిలోని కంబరవలస ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ప్రధానోపాధ్యాయులు ఎం.పైడిరాజు విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి : జయకృష్ణ

ప్రజాశక్తి - భామిని

నియోజకవర్గంలో ప్రధాన సమస్యలను పరిష్కరించి అభివృద్ధికి కృషి చేస్తానని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. శుక్రవారం మండలానికి విచ్చేసిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రజా ప్రతినిధులు ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాలని, అసెంబ్లీ నిబంధనలను భ్రష్టుపట్టించిన వైసిపికి ప్రజలు ఈ ఎన్నికల్లో గట్టిగుణపాఠం నేర్పారని తెలిపారు. గత ఐదేళ్లలో నియోజకవర్గ అభివృద్ధి అస్సలు పట్టించుకోలేదని, దోచుకో, దాచుకో అన్న చందంగా పాలన సాగిందని విమర్శించారు. పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, ఐటిడిఎల్లో నిధులు లేకపోవడం ఎవరి నిర్లక్ష్యమని ప్రశ్నించారు. అసెంబ్లీ దృష్టికి ఈ అంశాలు తీసుకెళ్లి యుద్ధప్రాతిపదికన నిధులు సమీకరణ చేసి, సమస్యలు పరిష్కరానికి దృష్టి సారిస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానన్నారు. వైద్యాధికారులు మలేరియా, డెంగీ ప్రబలకుండా చూడాలని, మలేరియా ఫ్రీ జోన్‌లోకి నియోజకవర్గం ఉండాలని సూచించామని తెలిపారు. గత టిడిపి ప్రభుత్వం హయాంలో నిధులు మంజూరు చేసి పనులు తలపెట్టిన జంపరకోట జలాశయం, భామిని కొండ లోయ గెడ్డ రిజర్వాయర్, లిఫ్ట్ ఇరిగేషన్‌కు వైసిపి నిధులు విడుదల చేయకుండా, వాటిని మూలకు చేర్చాయని విమర్శించారు. నిలిచిన వాటిని తిరిగి ప్రారంభించి పూర్తి చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. భామిని ప్రధాన రహదారి, బస్టాండ్ పనులపై దష్టి సారిస్తాన్నారు. తన విజయానికి నిరంతరం శ్రమించిన టిడిపి, జనసేన, బిజెపి కార్యకర్తలకు, నాయకులు, ప్రజలకు ధన్యవాదములు తెలిపారు. విలేకరుల సమావేశంలో టిడిపి సీనియర్ నాయకులు నిమ్మక పాండురంగా రావు, రవి నాయుడు, ఎం. జగదీశ్వరరావు, సర్పంచ్ లోపింటి రాజేష్,భూపతి ఆనందరావు, బిడ్డికి ప్రసాద్, కోరాడ రాజేష్, గురిబిల్లి లక్ష్మి పతి, జనసేన కో ఆర్డినేటర్ జానీ, మండలం అధ్యక్షులు రుంకు కిరణ్ ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

ఎండిఎం కార్మికుల తొలగింపు అన్యాయం

సిఐటియు ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి - కొమరాడ

కక్ష సాధింపు చర్యల్లో భాగంగా మధ్యాహ్న భోజన కార్మికులను తొలగించడం అన్యాయమని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం కోటిపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద తొలగించిన మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ గతేడాది డిసెంబర్‌లో ఒక్కరోజు అన్నం బాగా వండకపోతే ఆరు నెలల తర్వాత ఈరోజు కార్మికులను తొలగిస్తున్నామని చెప్పడం ఇదెక్కడ న్యాయమని ప్రశ్నించారు. కలెక్టర్, డిఇఒ, ఎంఇఒ తొలగించమన్నారని హెచ్‌ఎం చెప్పడం చూస్తే విడ్డూరంగా ఉందన్నారు. ఒకవేళ తప్పు జరిగితే పిల్లల తల్లిదండ్రులతోనైనా, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్, సభ్యులతో సమావేశం ఏర్పాటు చేయకుండా ఎలా మధ్యలో కార్మికులను తొలగిస్తారని ప్రశ్నించారు. ఈ పాఠశాలలో 18ఏళ్లుగా కార్మికులు బి.సావిత్రమ్మ, డి.సీత, వై.గంగమ్మ మధ్యాహ్న భోజనం వండి వడ్డిస్తున్నారన్నారు. ఇలాంటి సందర్భంలో ఒక్కరోజు అన్నం బాగోలేదని పత్రికల్లో వార్త వచ్చిందని ఎంఇఒ, డిఇఒ విచారణ చేసి కలెక్టర్‌కు పంపారన్నారు. అయితే ఈ విచారణలో స్థానిక స్కూలు కమిటీ చైర్మన్, కమిటీ సభ్యులను, పిల్లల తల్లిదండ్రులను కనీసం సంప్రదించకుండా దర్యాప్తు ఎలా చేపట్టారని ప్రశ్నించారు. ఈ విషయమై వెంటనే కలెక్టర్, డిఇఒ స్పందించి విద్యార్థుల తల్లిదండ్రులు, స్కూల్‌కమిటీ చైర్మన్, సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి వాస్తవాలు వెలికితీయాలని హెచ్‌ఎంకు వినతిని అందజేశారు. విచారణ చేయకపోతే కొత్తగా నియమించిన మధ్యాహ్నం భోజనం కార్మికులను అడ్డుకుంటామన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఎ.ఉపేంద్ర, నాయకులు శంకరరావు, అప్పలనాయుడు, శ్రీనివాసరావు, రవికుమార్, శ్రావణ్ కుమార్ విద్యార్థుల తల్లిదండ్రులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పాఠశాల వద్ద నిరసన తెలుపుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు

ఎమ్మెల్యేకు మున్సిపల్ అధికారుల అభినందనలు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పార్వతీపురం ఎమ్మెల్యేగా గెలుపొందిన బోనెల విజయచంద్రను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్, కార్యాలయ అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛాలను అందజేసి అభినందనలు తెలిపారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడుతూ పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. కమిషనర్ పాటు టౌన్ ప్లానింగ్ అధికారి పి.కనకారావు, డిఇ కిరణ్ కుమార్, ఆర్ఓ దిబ్బారుబే, జెఎఒ టి.అశోక్, ప్రజారోగ్య అధికారి సిహెచ్. మురళి, ఆర్ఐలు నారాయణరావు, వినయ్ కుమార్, క్యాషియర్ శంకరరావు, పబ్లిక్ హెల్త్ సూపర్వైజర్ వీరినాయుడు, జూనియర్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన బలోపేతానికి పనిచేద్దాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పాలకొండ

నియోజకవర్గంలో జనసేనను మరింత బలోపేతం చేసేందుకు అందరూ కలిసి ఉమ్మడిగా పని చేయాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన జయకృష్ణను జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు గర్భాన సత్తిబాబు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంతోష్ కుమార్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిక్‌రూంను పరిశీలిస్తున్న డిఎంఒ జగన్మోహనరావు

విద్యార్థులు సీజనల్ వ్యాధులకు గురికాకూడదు

ప్రజాశక్తి - సీతానగరం

వసతి గృహ విద్యార్థులు సీజనల్ వ్యాధులకు గురికాకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి (డిఎంఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. మండలంలోని జోగింపేటలో గిరిజన సంక్షేమ బాలుర వసతి గృహాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లో గదులను పరిశీలించి దోమల నివారణ మందు ఏ మేరకు పిచికారీ చేశారో గమనించారు. హాస్టల్ పరిసరాలను సందర్శించి వాడుక నీరు, వర్షపు నీరు నిల్వ లేకుండా జాగ్రత్త పడాలన్నారు. సిక్ రూం నిర్వహణను తనిఖీ చేసి అక్కడ బెడ్‌లకు ఏర్పాటు చేసిన దోమ తెరలను పరిశీలించారు. సిక్ రిజిష్టర్‌లో విద్యార్థుల ఆరోగ్య సమస్యల వివరాలు స్పష్టంగా ఉండాలని, వారి ఆరోగ్యం పట్ల నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. అక్కడ సిక్ రూంలో ఉన్న విద్యార్థి ఆరోగ్యం పరిశీలించి వైద్య సిబ్బందిచే జ్వర నిర్ధారణ పరీక్ష చేయించారు. హాస్టల్‌లో ప్రాథమికంగా అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలన్నారు. వైద్య, వసతి గృహ సిబ్బంది సమన్వయంతో ఉండి జ్వరాలు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎఎంఒ సూర్యనారాయణ, ప్రిన్సిపల్ బి.ధర్మరాజు, సూపర్వైజర్లు జయగౌడ్, శర్మ, వైద్య సిబ్బంది చైతన్య, లావణ్య, చంద్రినాయుడు, వసతి గృహ సిబ్బంది మీనాకుమారి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు వెంటనే చేపట్టాలి

ప్రజాశక్తి - పాచిపెంట

ఉపాధి హామీ పనులు వెంటనే చేపట్టాలని, రెండేళ్ల క్రితం చేసిన పనులకు డబ్బులు చెల్లించాలని కోరుతూ గిరిజన సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక మండలపరిషత్ కార్యాలయం వద్ద మండలంలోని సీతంపేట గ్రామ గిరిజనులు నిసన తెలిపారు. ఈ ధర్నానుద్దేశించి గిరిజన సంఘం నాయకులు డుంబిరి లచ్చయ్య, రూడి జర్నీ ఎర్రయ్య, ఆర్.గంగరాజు, కవిటి ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ రెండేళ్ల క్రితం చింత జోరు చెరువు, బొడ్డమాను జోరు చెరువు పనులను నాలుగు వారాలు పాటు చేసినా, నేటికీ డబ్బులు చెల్లించకపోవడం ఉపాధి హామీ అధికారులు పరిశీలన లేకపోవడం వల్ల దాదాపు పని చేసిందని అన్నారు. డబ్బుల్లేక నేటికీ రెండేళ్లు పైగా పనులు లేక పోస్తులతో ఇబ్బందులు పడుతున్న గిరిజనులపై అధికారులు నిర్లక్ష్యం తగదన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ నిర్లక్ష్యం వల్ల పనులు లేక పస్తులతో ఇతర ప్రాంతాలకు వలసలు పోయిన పరిస్థితులు కూడా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనుంచైనా అధికారులు ఆ దిశగా ఆలోచించి వెనుకబడిన గ్రామాల పట్ల అవగాహన ఉండాలని కోరారు. అనంతరం ఎంపిడిఒ పి.లక్ష్మీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. దీనికి ఎంపిడిఒ స్పందిస్తూ వెంటనే పనులు చేపట్టే ఏర్పాట్లు చేస్తానన్నారు. ఉపాధి అధికారులను, ఫీల్డ్ అసిస్టెంట్‌ను రప్పించి తక్షణమే గిరిజనులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పనులు ఇప్పించాలని ఆదేశించారు. ఈ మేరకు ఎంపిడిఒను గిరిజనులు అభినందించారు. ఇంతవరకు ఏ అధికారి కూలీలను, పేదలను ఇలా కూర్చోబెట్టి కష్టసుఖాలు అడిగి తెలుసుకోలేదని, ఇటువంటి అధికారులుంటే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు.

మెగా డిఎస్‌పిపై జనసేన హర్షం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రభుత్వం మెగా డీఎస్సీపై మొదటి సంతకం పెట్టడం పట్ల కురుపాం నియోజకవర్గ ఇన్చార్జ్ కడ్రక మల్లేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి పార్టీల ఎన్డీఏ ప్రభుత్వం గెలుపులో కీలకపాత్ర పోషించిన యువతను దష్టిలో పెట్టుకొని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి మొదటి సంతకం చేయడం ఎంత సంతోషంగా ఉందన్నారు.

ఎపిటిఎఫ్ హర్షం

పార్వతీపురంరూరల్ : కొత్త ప్రభుత్వం కొలువుతీరిన వెంటనే డిఎస్‌సి నియామకం కొరకు తొలి సంతకం చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ పక్షాన ధన్యవాదాలు తెలుపుతున్నట్టు జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మహేష్, బాలకృష్ణ తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలోనే జీవో 117ను రద్దుచేసి ఉన్నత పాఠశాలలో విలీనం చేసిన 3,4,5 తరగతులను తిరిగి ప్రాథమిక పాఠశాలలోకి పంపించే ఏర్పాటు చేయాలని తద్వారా ప్రాథమిక పాఠశాలలను సుసంపన్నం చేయాల్సిందిగా ముఖ్యమంత్రిని కోరారు. నిరంకుశంగా ప్రవర్తించిన రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్‌ను వెంటనే విద్యాశాఖ నుండి తప్పించాలని కోరారు.

సదస్సులో మాట్లాడుతున్న ఎపిపి వెంకటరమణ

రైతులు లాభదాయక విధానాలు అనుసరించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

రైతులు లాభదాయక విధానాలను అనుసరించాలని అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.వెంకటరావు అన్నారు. మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో డోకిశీలలో రైతు న్యాయ అవగాహన సదస్సు శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రైతు సంబంధిత చట్టాలపై అవగాహన పొందాలన్నారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు సమయంలో నాణ్యత చూడాలని, సంబంధిత బిల్లులు జాగ్రత్తపర్చాలని ఆయన సూచించారు. మోసాలకు గురైనప్పుడు చట్టాలకు అనుగుణంగా నష్టపరిహారం పొందవచ్చని చెప్పారు. రోజువారీ జీవనంలో ఎదురయ్యే అనేక సమస్యలకు చట్టపరంగా న్యాయం పొందవచ్చని ఆయన అన్నారు. మండల న్యాయ సేవా కమిటి న్యాయ సహాయం ఉచితంగా అందిస్తుందని ఆయన చెప్పారు. దీన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా పలువురు రైతులకు సత్కరించారు. కార్యక్రమంలో లోక్‌అదాలత్ కమిటీ సభ్యులు టి.జోగారావు, ఐటిడిఎ పిఎఒ జి.శ్రీనివాసరావు, వ్యవసాయ అధికారి ఎం.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నర్సిపురంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించండి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ప్రభుత్వ పాఠశాలల్లో మీ పిల్లలను చేర్పించాలని మండలంలోని నర్సిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటనాయుడు కోరారు. ఈ మేరకు గ్రామంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ పాఠశాలలో ఇటీవల టెన్త్ పరీక్షల్లో ఇంగ్లీష్ మీడియంలో శత శాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు 60 మందిలో 19 మందికి 500కు మించి మార్కులు వచ్చినట్టు తెలిపారు. గ్రామస్తులను తమ పిల్లలను పాఠశాలలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి నల్లా బాలకృష్ణారావు విద్యార్థులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు పురుషోత్తం, వెంకటనాయుడు, బివి పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎఎంసి కార్యవర్గం రాజీనామా

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం మొత్తం రాజీనామాలు సమర్పించినట్లు కార్యదర్శి శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో గత ప్రభుత్వంలో నామినేటెడ్ అయిన కార్యవర్గాల నుంచి రాజీనామాలు స్వీకరిస్తున్న నేపథ్యంలో శుక్రవారం చైర్మన్ ఎం.భాగ్యలక్ష్మితో పాటు 14 మంది సభ్యులు నుంచి రాజీనామా లేఖలు స్వీకరించి ప్రభుత్వానికి పంపిస్తున్నట్లు ఆయన తెలిపారు.

పింఛన్ల పెంపుపై హర్షం

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

సిఎంగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలుపుకునేందుకు పేదలను సంక్షేమంతో ఆదుకునేందుకు ఐదు సంతకాలు ఎంతగానో ఉపయోగపడతాయని మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు అన్నారు. ఈ మేరకు మండలంలోని కృష్ణపల్లిలో శుక్రవారం చిరంజీవులు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు.

పాలకొండ : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి శుక్రవారం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మోజూరు తేజోవతి, మండల అధ్యక్షులు గండి రామినాయుడు తదితరుల ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన వెంటనే గతంలో తాను ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు డిఎస్‌సి, ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు, పింఛన్ల పెంపు, అన్నా క్యాంటీన్లను పునరుద్ధరణ, యువత నైపుణ్య గణన మీద సంతకం పెట్టి చరిత్రలో నిలిచే వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో కోట సంఘం నాయుడు, కిమిడి బంగారు నాయుడు ఆయా పార్టీల కార్యకర్తలు పాల్గొన్నారు.

ద్వారబంధంలో శ్రమదానం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని మర్రిపాడు పంచాయతీ దిగువ ద్వారబంధం నుండి ఎగువ ద్వారాబంధం సిసి రోడ్డు పనులు గ్రామస్తులు శుక్రవారం శ్రమదానం చేపట్టారు. గ్రామస్తులు ఐక్యంతో చెయ్యి చెయ్యి కలిపి, రాయి, రాయి పేర్చి తమ ఊరుకు రోడ్డును వారే బాగు చేసుకుంటున్నారు. ప్రజలు నడవడానికి వీలుగా రహదారిని శ్రమదానంతో బాగు చేసుకుంటున్నారు.

అందుబాటులో ఉంటూ సేవ చేయండి

ప్రజాశక్తి-విజయనగరం

ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేయాలని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం తన నివాసంలో సాలూరు నియోజక వర్గం, మెంటాడ మండలం సర్పంచులు, జెడ్‌పిటిసిలు, ఎంపిటిసి సభ్యులతో శుక్రవారం మాజీ మంత్రి పీడిక రాజన్నదొర, ఎమ్మెల్సీ సురేష్‌బాబుతో కలిసి సమావేశమయ్యారు. ఈసందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికలలో గెలుపు ఓటములు సహజమని, ప్రజా తీర్పును గౌర వించాలని అన్నారు. నిరంతరం ప్రజలతో మమేకమై వారి సమస్యలు పరిష్కరించేం దుకు కృషి చేయాలని సూచించారు. నిరంతరం నియోజక వర్గ స్థాయిలో రాజన్నదొర, జిల్లా స్థాయిలో తాను కార్యకర్తలకు, నాయకులకు అందుబాటులో ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి సన్యాసి నాయుడు, వైస్ఎంపిపి ఈశ్వరరావు, రత్నాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పెదపెంకిలో సాయిరాం మందిరం వద్ద శుక్రవారం నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకులు ఈర్ల సంజీవ నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శ్రీకాకుళం జిల్లా రాగోలు వద్ద జిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరానికి 42మందికి ఒపి నిర్వహించగా 15 మంది వరకు వైద్య పరీక్షలు నిర్వహించి కంటి ఆపరేషన్లకు ఎంపికైనట్లు కంటి తనిఖీ వైద్యులు పావని తెలిపారు. కార్యక్రమంలో శ్రీదేవి, శ్రీను, తవిటి నాయుడు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు తనికీ చేస్తున్న వైద్యాధికారి